క్లుప్తంగా

పశువులకు వ్యాక్సిన్ తప్పనిసరి



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న ఏడీ అశ్వథామ

డుంబ్రిగుడ: పశువులకు వేసవిలో ఎఫ్‌ఎండీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలని పశుసంవర్థక శాఖ ఏడీ అశ్వథామ తెలిపారు. సోమవారం కురిడి పంచాయతీ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. 192 పశువులకు వ్యాక్సిన్ వేసి ఉచితంగా మందులను అందజేశారు. ఎటువంటి వ్యాధులు రాకుండా ఈ వ్యాక్సిన్ ఉపయోగపడుతుందని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పశుసంవర్థక శాఖ వైద్యాధికారి రాజశ్రీ, సిబ్బంది త్రినాథ్‌రావు, జి. మహేష్, మనోజ్, ప్రకాష్, అప్పారావు, అనంత్ పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము తగ్గించారంటూ ఫిర్యాదు

రావికమతం : తమ గ్రామ వలంటీర్లు ఈ నెల పింఛన్ సొమ్ములో కోత విధించి, తక్కువ పింఛన్ నగదు అందించారంటూ కన్నంపేట గ్రామానికి చెందిన పలువురు పింఛన్‌దారులు ఎంపీడీవో వెంకన్నబాబుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆ గ్రామంలో వారం రోజుల్లో భక్తాంజనేయ ఉత్సవాలు జరగనున్నాయి. అయితే పండగ విరాళంగా తమకు చెప్పకుండానే ఒక్కొక్కరి పింఛన్లో రూ.వెయ్యి నుంచి రూ.1,500 కోత విధించారని ఆరోపించారు. ఇదేమని అడిగితే మందలిస్తున్నారని పింఛన్‌దారులు దంట్ల శ్రీరామ్‌కోటి, బంటు రామకృష్ణ, జగ్గారావు తదితరులు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎంపీడీవో వారికి హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



సుబ్బారావు (ఫైల్)

రాజవొమ్మంగి: బట్టావారి వీధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బీరబోయిన సుబ్బారావు (45) బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై చికిత్స పొందుతూ సోమవారం మరణించారు. దోనెలపాలెం గ్రామానికి చెందిన ఆయన ఆదివారం తన ఇంటి వద్దే ఉన్నపళంగా కుప్పకూలిపోయారు. వెంటనే కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించారు. మృతుడికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు. సుబ్బారావు మరణంతో రాజవొమ్మంగిలో విషాదం అలుముకుంది. యూటీఎఫ్ తదితర ఉపాధ్యాయులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సుబ్బారావు భౌతిక కాయానికి నివాళులర్పించారు.

కానిస్టేబుల్ మృతికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి సాయం చేస్తున్న పోలీసు స్నేహితులు

డుంబ్రిగుడ: పద్మపురం గ్రామానికి చెందిన 1990 బ్యాచ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ సమర్థి బొజ్జ అనారోగ్యంతో వారం రోజుల క్రితం మృతి చెందాడు. దాంతో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పోలీసు శాఖ బ్యాచ్‌మెంట్ సోమవారం మృతుడి కుటుంబానికి రూ.50 వేల అందజేసింది. స్నేహితుడి కుటుంబానికి సాయం చేయడం ఎంతో సంతోషంగా ఉందని వారు తెలిపారు. పోలీసులు బాబూరావు, రాజబాబు, సంజీవరావు, వెంకటేశ్వరావు, సుబ్బరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి ఎస్సై చేయూత

కూనవరం: టేకులబోరు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ యడ్ల రవి (30) కుటుంబానికి ఎస్సై బి. వెంకటేష్ సోమవారం తన సిబ్బందితో కలిసి రూ.10 వేలు అందించారు. రవి అనారోగ్యంతో కాకినాడలో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతితో భార్య, ఇద్దరు చిన్నారులు దిక్కులేని వారయ్యారు. ఈ విషయం తెలుసుకుని సాయమందించారు. హెడ్ కానిస్టేబుల్ వీరయ్య, కానిస్టేబుల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్ గెలుపు.. అభివృద్ధికి మలుపు

- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు



పాడేరు రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పక్కన ఎంపీ మాధవి, బుల్లిబాబు

పాడేరు రూరల్: అధికార పార్టీ అభ్యర్థులు గెలిస్తే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యపడుతుందని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం పాడేరు పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను, బోధకులను అభ్యర్థించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల శ్రేయస్సు కోసం అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఇతర పార్టీల అభ్యర్థులు చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం రాష్ట్రం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, పాడేరు ఎంపీపీ సొనారి రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తడబారికి సురేష్‌కుమార్, మండలాధ్యక్షుడు సీదరి రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పాడేరు రూరల్: హాజరైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు

సీతంరాజు సుధాకర్‌ను గెలిపిద్దాం : ఎమ్మెల్యే పాల్గుణ

హుకుంపేట: వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. సోమవారం హుకుంపేటలో స్థానిక నాయకులతో కలిసి ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు. కేజీబీవీ, ఐసీడీఎస్ కార్యాలయం, బాలుర పాఠశాలలో పర్యటించి ఉపాధ్యాయులను అభ్యర్థించారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కొండలరావు, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, సర్పంచ్‌లు కాకరి బొంజుబాబు, సమిడ వెంకటపూర్ణిమ, సాంబ, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నాగరాజు, ఎంపీటీసీలు గంజాయి సుశీల, కిలగడ సింహాచలమ్మ, నాగలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ భూషణ్, కోటిబాబు, నాయకులు పెలమల రమేష్, సూరిబాబు, చిన్నబ్బి, వెంకట్, అనిల్ పాల్గొన్నారు.

సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి



కొయ్యూరు: మాట్లాడుతున్న చొక్కాకుల వెంకటరావు

కొయ్యూరు: విద్యావంతులందరికీ మేలు చేసే సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకట్రావు కోరారు. సోమవారం రాజేంద్రపాలెంలో పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షన్నర మందికిపైగా పట్టభద్రులకు సచివాలయాల్లో ఉద్యోగాలు వచ్చాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు మూలంగా జీవో నంబర్ –3ను నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. మన్యంలో గిరిజనులకు ఉద్యోగాలు విషయమై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఎస్టీ కమిషన్ సభ్యులు, కొయ్యూరు మండల ఎన్నికల పరిశీలకులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, పార్టీ మండలాధ్యక్షుడు జల్లి బాబులు, ఏఎంసీ చైర్మన్ జె. రాజులమ్మ, వైస్ ఎంపీపీలు అప్పన గజ్జయ్యదొర, అంబటి నూకాలు, సర్పంచ్‌లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. సోమవారం కంఠభంసుగూడ, జెడ్పీ కాలనీల్లో మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, మాడగడ పంచాయతీలో సర్పంచ్ జ్యోతి, పెదలబుడు పంచాయతీలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, చిన్నలబుడు పంచాయతీలో ఎంపీటీసీ సభ్యురాలు సీత, సుంకరమెట్ట పంచాయతీలో సచివాలయం కన్వీనర్ గణేష్, పద్మపురం పంచాయతీలో సర్పంచ్ సుస్మిత ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు రఘునాథ్, రామారావు, శివ, బాలరాజు, గోపాల్, భీమరాజు, సత్రుగూన్, సత్యానందం, సన్యాసి, నర్సింగ్‌గరావు, సుంక్ర, అర్జున్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టు: ఎమ్మెల్సీ కరపత్రం అందిస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి, నాయకులు

ముంచంగిపుట్టు: ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నామని వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి తెలిపారు. మండలంలోని వనుగుమ్మ, దొడిపుట్టు, మాకవరం, జోలాపుట్టు, కిలగాడ, వనభసింగి, ఏనుగురాయి, పెదగూడ పంచాయతీల్లో సోమవారం ఆమె సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలతో ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను అందించారు. సర్పంచ్‌లు రమేష్, గంగాధర్, నీలకంఠం, నరసింగరావు, మండలాధ్యక్షుడు మల్లికార్జున్, నేతలు జగబందు, తిరుపతి, రాంప్రసాద్, జయదేవ్, జగన్, శివ, దాసు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలించాలని కోరుతూ సోమవారం కంద్రుం పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మర ప్రచారం చేపట్టారు. నాయకులు బాకసింహాచలం, కృష్ణారావు, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, జగ్గునాయుడు పాల్గొన్నారు.



గూడెంకొత్తవీధి: దావనాపల్లిలో ప్రచారం చేస్తున్న ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు మత్యరాస వెంకటలక్ష్మి

గూడెంకొత్తవీధి: వైఎస్సార్ సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ సభ్యురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి కోరారు. ఆమె సోమవారం దావనాపల్లి పంచాయతీలో ప్రచారం చేశారు. జర్రెల మాజీ సర్పంచి అడపా విజయకుమారి, జి.మాడుగుల మాజీ ఎంపీపీ వెంకటగంగరాజు, సీనియర్ నాయకుడు శేఖర్ పాల్గొన్నారు.



హుకుంపేటలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ, జెడ్పీటీసీ

జి.మాడుగుల: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పార్టీ మండల ఎన్నికల పరిశీలకుడు వీవీ రమణమూర్తి, మండలాధ్యక్షుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఎన్. మత్స్య కొండంనాయుడు కోరారు. కె. కోడాపల్లి పంచాయతీ బందవీధి తదితర గ్రామాల్లో సోమవారం వారు విస్తృతంగా ప్రచారం సాగించారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు వెంకట్ పాల్గొన్నారు.

విస్తృతంగా హిందూ ధర్మ ప్రచారం

అడ్డతీగల: గిరిజన ప్రాంతంలోని ఆలయాల ద్వారా హిందూ ధర్మ ప్రచారం విస్తృతంగా చేస్తున్నట్లు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య తెలిపారు. హిందూ ధర్మ ప్రచారం చేయాలనే సంకల్పంతో విష్ణు సహస్రనామ స్తోత్రం గొప్పతనాన్ని తెలియజేయాలని పవనగిరి సేవా ట్రస్ట్ ద్వారా మాచిరాజు పుస్తకం ముద్రించారన్నారు. రూ.252 విలువైన ఈ పుస్తకాన్ని రూ.100కే పంపిణీ చేస్తున్నామన్నారు. 9347893657 సంప్రదించాలన్నారు.

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో పేదలకు భోజన ప్యాకెట్లు



భోజనం ప్యాకెట్లు స్వీకరిస్తున్న పేద మహిళలు

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సోమవారం సీఆర్పీఎఫ్ డి42 బెటాలియన్ ఆధ్వర్యంలో పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఒకపక్క వారపు సంతకు, మరో పక్క ప్రభుత్వ కార్యాలయాల పనులపై వచ్చిన వారు సుమారు 180 మందికి వీటిని అందజేశారు. బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు ఎం.ఎల్. నాయుడు, ఇన్‌స్పెక్టరు వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యగుండంలో సాధుకు అంత్యక్రియలు

హుకుంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం మత్స్యగుండంలో భిక్షాటన చేసుకునే సాధు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ శాంతకుమారి, గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. మత్స్యగుండం ఆలయం వద్ద మూడేళ్లుగా అతడు అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఉండేవాడని, ఆదివారం కొత్తూరులో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



జడ్డంగి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ షేక్ బాజిలాల్

రాజవొమ్మంగి: రోడ్డు ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సీఐ షేక్ బాజిలాల్ సోమవారం జడ్డంగి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మూడు రోడ్ల కూడలి వద్ద చుట్టుపక్కల యువకులు, వాహనచోదకులు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ఉపయోగించాలని సీఐ సూచించారు. ముందు వెళ్లే వాహనాలను ఓవర్ టేక్ చేయడం ప్రమాదకరమన్నారు. ఎస్సై షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీకి ఎమ్మెల్యే పాల్గుణ పరామర్శ

పాడేరు రూరల్: స్థానిక జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న పెదబయలు మండలం పెదకోడాపల్లి ఎంపీటీసీ పాంగి రామారావును అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సోమవారం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న అతడికి మెరుగైన వైద్య సేవలు కల్పించాలని ఆస్పత్రి వైద్యులు, సిబ్బందికి సూచించారు. మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వరరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాతరి సురేష్‌కుమార్, నాయకులు తిలక్ ఉన్నారు.



ఎంపీటీసీ రామారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

దళిత యువకుడి హత్యకు నిరసనగా రాస్తారోకో

నర్సీపట్నం : పాయకరావుపేట మండలం, పి.ఎస్.పురంలో జరిగిన దళిత యువకుడు నాగేంద్ర హత్యను నిరసిస్తూ సోమవారం దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆర్డీవో కార్యాలయం ఎదురుగానున్న మెయిన్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ముందుగా అబిద్‌సెంటర్లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. అక్కడి నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని రాస్తారోకో చేపట్టారు. దోషులను కఠినంగా శిక్షించాలంటూ దళిత ఐక్యవేదిక నాయకులు ఆర్డీవో హెచ్.వి.జయరాంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు చిట్ల చలపతిరావు మాట్లాడుతూ దళిత యువకుడిని హత్య చేసిన దోషులను తక్షణమే అరెస్టు చేయాలన్నారు. నిందితులను అరెస్టు చేయటంలో పోలీసులు తాత్సారం చేయటం తగదన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఆరుగుల్ల రాజుబాబు, మార్తి అప్పలరాజు, యర్రంశెట్టి పాపారావు, గాతాడ సహదేవ్, యాదగిరి దాసు, కిడారి మల్లేష్, చవల నాగేశ్వరరావు, ఏనుకూరి పాపారావు, తమ్మిలి అప్పారావు, చిట్ల చిన నూకరాజు, చిట్ల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న దళిత ఐక్యవేదిక నాయకులు

ఆ గ్రామాల్లో మరోసారి భూ సర్వే



సర్వే, రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ మహేశ్వరరావు

రావికమతం : మండలంలో తొలి దశలో భూ రీసర్వే జరిగిన 11 గ్రామాలలో తప్పొప్పులను సరిచేస్తూ మరోసారి సర్వే ప్రారంభించాల్సిందిగా సర్వే, రెవెన్యూ సిబ్బందికి తహసీల్దార్ మహేశ్వరరావు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రత్యేక సమీక్షలో ఆయన మాట్లాడారు. మండలంలోని చినపాచిల, మత్స్యపురం, మచ్చవానిపాలెం, గుమ్మాళ్లపాడు, పెదపాచిల, జెడ్.కొత్తపట్నం, దిబ్బి, కానాడ, రావికమతం, గర్నికం, కొమిర గ్రామాలలో తొలివిడత రీసర్వే పూర్తయ్యిందన్నారు. అయితే సిబ్బంది తొందరపాటు వలన కొంత మంది రైతుల నుంచి అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. రైతుల భూ విస్తీర్ణంలో లోపాలు, ఆధార్ తదితర వివరాల తప్పుడు నమోదు, బ్యాంకు ఖాతాల నమోదులో తప్పులు దొర్లడంతో కొంత మంది రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం నుంచే రీసర్వే మరలా ప్రారంభించినట్టు వెల్లడించారు. ఇకపై తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని హెచ్చరించారు. రైతులకు దండోరా ద్వారా సమాచారం ముందుగా తెలియజేయాలన్నారు. రైతులు ఆధారాలను సిబ్బందికి చూపాలని తహసీల్దార్ కోరారు.

రూ.20 లక్షల బీమా అందజేత

రోలుగుంట : మండలంలో శరభవరం గ్రామానికి చెందిన కలిగట్ల సూర్యనారాయణ గతేడాది సెప్టెంబర్లో పొలానికి వెళ్లి మోటారు ఆన్ చేసే సమయంలో విద్యుదాఘాతానికి గురై మరణించాడు. మృతుడు ఏపీజీవీబీలో రూ.1000 సాధారణ బీమా చేయించుకోవడంతో అతనికి బీమా వర్తించి రూ.20 లక్షలు మంజూరైంది. ఆ చెక్‌ను అనకాల్లి జిల్లా రీజనల్ మేనేజర్ ఈ గ్రామం లావాదీవీలు జరుపుతున్న నర్సీపట్నం ఏపీజీవీబీ మేనేజర్ దుప్పాడ గణేష్‌తో కలసి సోమవారం మృతుడి నామినీ అయిన అతని తండ్రి వెంకునాయుడికి గ్రామ పెద్ద దోసపత్ని రాజు సమక్షంలో అందించారు. కార్యక్రమంలో స్థానిక నోడల్ అధికారి పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత



బాధిత కుటుంబానికి నగదు అందచేస్తున్న సర్పంచ్

చింతూరు: మండలంలోని కుమ్మూరులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మడకం లక్ష్మయ్య కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేసినట్లు సర్పంచ్ ముచ్చిక నాగార్జున సోమవారం తెలిపారు. వైఎస్సార్ బీమా మిగతా రూ.90 వేలు నామినీ ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది లక్ష్మణ్, సురేష్, పద్మ, వెంకటరాజు, నాగమణి పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ఎన్నిక



మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ నూతన ఉత్సవ కమిటీని సోమవారం లాటరీ పద్ధతిలో ఎన్నుకున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, ఉపసర్పంచ్ శ్రీనాదు శ్రీనువాసరావు ఆధ్వర్యంలో 200 దరఖాస్తులురాగా వార్డుకు ఒకరు చొప్పున 16 మందిని ఎంపిక చేసినట్టు వెల్లడించారు. ఈ కమిటీ సభ్యులు రెండేళ్లపాటు కొనసాగనున్నట్టు పేర్కొన్నారు.

'విజన్ బిల్డింగ్'పై మహిళలకు శిక్షణ

కోటవురట్ల : స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ఆధ్వర్యంలో విజన్ బిల్డింగ్ (కలల నిర్మాణం)పై మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఏపీఎం బి.డి. తిలక్ మాట్లాడారు. శిక్షణలో ఇచ్చే మెలకువలను పాటించి భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలన్నారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, కార్యదర్శి అప్పలనరసమ్మ, ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, సీసీలు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కండి.. ఆరోగ్యం పొందండి



సైక్లింగ్ చేస్తున్న వైద్యాధికార్లు శశికాంత్, రవిచంద్రశేఖర్

జి.మాడుగుల: సైకిల్ తొక్కటం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికార్లు శశికాంత్, ఈ రవిచంద్రశేఖర్ తెలిపారు. సోమవారం జి.మాడుగులలో ×సైకిల్ ఫర్ హెల్త్¯ గురించి విద్యార్థులకు వారు అవగాహన కల్పించారు. సైకిల్ తొక్కటం వల్ల క్యాన్సర్ వ్యాధిని సైతం జయించి సంపూర్ణంగా ఉండవచ్చని సూచించారు. ఎంపీహెచ్ఈవో ఎన్ ప్రకాష్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి, విద్యార్థులు తదితరలు పాల్గొన్నారు.

ఒలేక్‌వో మహిమ ఆలయం ప్రారంభం



ఒలేక్‌వో ఆలయం ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గుంటసీమ ఆలయంలో థింసా నృత్యం చేస్తున్న స్థానికులు

డుంబ్రిగుడ: అరమ పంచాయతీ మురిసి గ్రామ సమీపంలో గుంటసీమ–డుంబ్రిగుడ ప్రధాన రహదారి సమీపంలో ఒలేక్‌వో మహిమ ఆలయాన్ని ఎంపీటీసీ పద్మ, సర్పంచ్ మోతిలాల్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బాక సింహాచలం, కృష్ణారావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బౌద్ధ మతానికి చెందిన ఆలయం డుంబ్రిగుడ మండలంలో ఇదే మొదటిదని ఆలయ కమిటీ సభ్యులు రాందాస్, పరుశురాం, తుమ్‌నాథ్ తెలిపారు. జాతర ఏర్పాటు చేస్తున్నామన్నారు. అరమ ఎంపీటీసీ పద్మ, గుంటగన్నెల ఎంపీటీసీ పద్మ, కాఫీ బోర్డు నంబర్ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జంగమయ్య జాతర: గుంటసీ పంచాయతీలో సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం జంగమయ్య ఆలయంలో ఘనంగా జాతర నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. థింసా నృత్య ప్రదర్శన చేశారు. వైస్ ఎంపీపీలు శెట్టి ఆనంద్‌రావు, రామన్న, పార్టీ నాయకుడు కృష్ణారావు, ఉప సర్పంచ్ జగ్గనాయుడు, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, ఎండీయూ జిల్లా అధ్యక్షుడు సునీల్, బాలాజీ, రాంబాబు, ప్రేమానందం పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

రాజవొమ్మంగి: వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో బాపన్నదొర సూచించారు. ఆయన తన కార్యాలయంలో సోమవారం 3 నుంచి 5 గ్రేడులకు చెందిన కార్యదర్శులతో సమీక్షించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్, చలివేంద్రాల ఏర్పాటు, మిషన్ అంత్యోదయ, జీజీఎంపీ పనులు, ఎన్ఆర్‌జీఎస్ ఎక్కౌంట్స్ తదితర అంశాలపై చర్చించారు. గ్రామ పంచాయతీ జనరల్, 15 ఫైనాన్స్ నిధులు, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్స్ పని చేస్తున్న తీరుపై తదితర అంశాల గురించి వివరించారు. ఎన్‌హెచ్ –516ఈ రహదారి పనుల్లో భాగంగా ఎవరైనా ఆస్తులు నష్టపోతుంటే, ఆ వివరాలు సేకరించాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

తమలపాకు తోటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

పాయకరావుపేట : తమలపాకు పంటలను పండించే రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల ఉద్యానవనశాఖాధికారి సిహెచ్.ఉమామహేశ్వరి అన్నారు. సత్యవరం గ్రామంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. తమలపాకు తోటలకు సోకుతున్న ఆకుకుళ్ళు, మొదలుకుళ్ళు, ఆకుమచ్చ, కాండంగజ్జి తెగులు, నత్తలు, గొంగళి పురుగులు ద్వారా సంక్రమించే తెగుళ్లను ఎదుర్కోవడానికి రైతులు తీసుకోవాలని జాగ్రత్తలు, ఉపయోగించవలసిన పురుగు మందులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఏ తెగుళ్లకు ఏఏ పురుగు మందులు పిచికారీ చేయాలో రైతులకు అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న హార్టికల్చర్ అధికారిణి ఉమామహేశ్వరి